సాక్షి అనకాపల్లి

బుధవారం । 22 । ఫిబ్రవరి । 2023



ఉపాధి 'బంక్'లు

గిరిజన గూడేల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ జీసీసీ పెట్రోల్ బంక్‌లు నిర్వహిస్తోంది.

10లో



శత వసంత కళా వైభవం

విశాఖ: ఈ నెల 25న దుబాయ్‌లో ఎన్టీఆర్, ఘంటశాల శత జయంతి కళా వైభవం నిర్వహిస్తున్నట్లు ఆచార్య యార్లగడ్డ తెలిపారు.

వాతావరణం

అనకాపల్లి టౌన్: రాగల అయిదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి మంగళవారం పేర్కొన్నారు. ఉష్ణోగ్రతలు 32 నుంచి 32.4 డిగ్రీలు, తేమ 81 నుంచి 83 శాతం, గాలి గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

నూకాంబిక అమ్మవారి గర్భగుడి దర్శనం నిలిపివేత



అనకాపల్లి టౌన్: గవరపాలెం నూకాంబిక ఆలయంలో కొత్త అమావాస్య జాతరను పురస్కరించుకొని అమ్మవారి విగ్రహానికి రంగులు వేస్తున్నందున నాలుగు రోజులపాటు గర్భగుడి దర్శనం నిలిపివేస్తున్నట్టు ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు గర్భగుడి దర్శనాలు ఉండవని, ఆదివారం తెల్లవారుజాము నుంచి తిరిగి దర్శన భాగ్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

జీవీఎంసీ కమిషనర్‌తో ప్రపంచ బ్యాంక్ బృందం భేటీ



దాబాగార్డెన్స్ (విశాఖ): ప్రపంచ బ్యాంక్ బృందం (ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యులు) మంగళవారం జీవీఎంసీ కమిషనర్ రాజాబాబును కలిసింది. స్మార్ట్‌సిటీస్ ప్రాజెక్టుల్లో భాగంగా చేపడుతున్న పనులు, వాటి ఆర్థిక పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. నగరంలో పార్కులు, స్కూల్స్, సోలార్ విద్యుత్ ప్రాజెక్టు, రోడ్లు, సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణం వంటి పనుల పురోగతి గురించి కమిషనర్ వారికి వివరించారు.

సింహాచలం దేవస్థానంలో అంతర్గత బదిలీలు



సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో పలు విభాగాలకు సంబంధించి అధికారులు, సిబ్బందిని అంతర్గత బదిలీలు చేస్తూ ఈవో వి.త్రినాథరావు ఉత్తర్వులు జారీ చేశారు. శానిటేషన్ విభాగంగా ఉన్న ఏఈవో ఎన్.ఆనందకుమార్‌ను ఆలయ ఏఈవోగా నియమించారు. ఆలయ ఏఈవోగా ఉన్న నరసింహరాజును ప్రసాదాలు, అన్నదాన విభాగం ఏఈవోగా బదిలీ శారు. ఆలయ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న పిల్లా శ్రీనివాసరావు లీజెస్ సెక్షన్, గోశాల పర్యవేక్షకుడిగా బదిలీ చేశారు.

ఎటపాక జెడ్పీటీసీకి అరుదైన అవకాశం



శిక్షణలో పాల్గొన్న జెడ్పీటీసీ సుష్మిత

ఎటపాక (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఉన్నత విద్యావంతురాలైన జెడ్పీటీసీ ఉబ్బా సుస్మితకు అరుదైన అవకాశం లభించింది. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు ఆహ్వానం అందింది. పీసా చట్టం అమలులో ఉన్న పది రాష్ట్రాలకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యే, ఐఏఎస్, ఐపీఎస్, డీఎల్‌పీవో, ప్రజాప్రతినిధుల్లో ఉన్నత విద్యావంతులను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది.

108లో సుఖ ప్రసవం



శిశువును అందజేస్తున్న ఈఎంటీ శ్రీను

జి.మాడుగుల (అల్లూరి సీతారామరాజు జిల్లా): పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మగ బిడ్డకు జన్మనిచ్చింది. బొయితిలి పంచాయతీ బూసులకోట గ్రామానికి చెందిన లవిడి కుమారికి మంగళవారం మధ్యాహ్నం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. ఆస్పత్రికి తీసుకువెళుతుండగా ప్రసవం అయింది. తల్లీబిడ్డలను తదుపరి వైద్యానికి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

హాయ్.. హాయిగా..

సెల్ ఫోన్ పోయిందంటే.. ఒకప్పుడు తిరిగి దొరుకుతుందన్న ఆశ ఉండేది కాదు. చాలా మంది ఫిర్యాదు చేసేవారే కాదు. మిగతా వారు మొక్కుబడిగా కంప్లయింట్ ఇచ్చేవారు. పోయిన మొబైల్ ఫోన్ తిరిగి తమకు చేరుతుందన్న నమ్మకం లేకపోవడమే అందుకు కారణం. కానీ అనకాపల్లి పోలీసు శాఖ గత ఏడాది చేపట్టిన వినూత్న కార్యక్రమం సత్ఫలితాలను ఇవ్వడమే కాక మిగతా జిల్లాల వారికి కూడా ఆదర్శంగా నిలుస్తోంది. గత నవంబర్ 21వ తేదీన నూతన సాంకేతిక పరిజ్ఞానంతో 'మొబైల్ ట్రాకర్' ఆన్‌లైన్ లింక్‌ని అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ టెక్నాలజీతో రెండు విడతల్లో జిల్లావాసులు పోగొట్టుకున్న సుమారు రూ.48 లక్షల విలువైన 241 మొబైల్ ఫోన్లను రికవరీ చేశారు.



మాట్లాడుతున్న ఎస్పీ గౌతమి సాలి, చిత్రంలో అడిషనల్ ఎస్పీలు విజయభాస్కర్, పి.ఎస్.ఎన్.రావు

- సెల్ ఫోన్ల రికవరీలో పోలీస్ ఐటీ కోర్ టీమ్ అ'ద్వితీయ' ప్రతిభ
- వాట్సాప్ నంబర్‌కు 'హాయ్' అని మెసేజి పెడితే చాలు..
- మొబైల్ ట్రాకింగ్‌తో ఆచూకీ కనుగొంటున్న నిపుణులు
- మొదటి విడతలో 131 ఫోన్ల రికవరీ
- రెండో విడత రికవరీ మేళాలో బాధితులకు మరో 110 మొబైల్ ఫోన్ల అందజేత
- ఆశ్చర్యం, ఆనందం వ్యక్తం చేస్తున్న బాధితులు

సాక్షి, అనకాపల్లి: మొబైల్ ఫోన్ల రికవరీలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అనకాపల్లి పోలీసు శాఖ పురోగతి సాధించింది. ఫోన్ పోగొట్టుకున్నవారి కోసం 9505200100 వాట్సాప్ నంబరును ఏర్పాటు చేశారు. ఈ నంబరుకు హాయ్ అని మెసేజ్ చేయాలి. వెంటనే మొబైల్ ట్రాకర్ రంగంలోకి దిగుతుంది. కొన్ని క్షణాల్లోనే బాధితుల నుంచి ఐటీ కోర్ టీం సమాచారం సేకరిస్తుంది. మొబైల్ ట్రాకర్ లింక్ పంపిస్తారు. ఆ లింక్‌పై క్లిక్ చేసి బాధితుడి వివరాలు, మొబైల్ వివరాలు, ఏ ప్రాంతంలో పోగొట్టుకున్నారు.. మొదలైన సమాచారాన్ని నమోదు చేయాలి. దీంతో ఐటీ కోర్ టీంకు సమాచారం అందడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు కూడా చేసినట్లవుతుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో మొబైల్‌ని ట్రేస్ చేస్తార ఐఎంఈఐ కోడ్, మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా పోయిన మొబైల్ ప్రాంతాన్ని, అది ఎక్కడ నుంచి సిగ్నల్స్ తీసుకుంటుందో అక్కడ టవర్ ఆధారంగా త్వరితగతిన కనిపెట్టేస్తారు.

ఏడాదిలో వెయ్యి కేసులు నమోదు

జిల్లాలో గతేడాది జనవరి నుంచి ఈ ఏడాది జనవరి వరకు దాదాపు వెయ్యి వరకు మొబైల్ ఫోన్లు పోయినట్టు కేసులు నమోదయ్యాయి. గతేడాది నవంబర్ నెలలో తొలి విడత ఫోన్ల రికవరీని ప్రకటించాక పోలీసులకు ఫిర్యాదులు పెరిగాయి. మొత్తం ఫిర్యాదుల్లో 70 శాతం నవంబర్ తర్వాతే వచ్చాయి. బాధితుల్లో ఎక్కువగా విద్యార్థులు, ఉద్యోగులు ఉండడం విశేషం. కొంత మంది లింక్ క్లిక్ చేసి పూర్తిగా వివరాలు నమోదు చేయకపోవడంతో రిజెక్ట్ అవుతున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

పోలీస్ ఐటీ కోర్ టీం కృషి అభినందనీయం

మొబైల్ బాధితులు త్వరితగతిన ఫిర్యాదు చేయడానికి ఈ నూతన విధానం రూపొందించాం. మొబైల్ ట్రాకింగ్ ద్వారా మా ఐటీ కోర్ టీమ్ పోయిన ఫోన్ల ఆచూకీ తెలుసుకుంటున్నారు. ఫోన్లు పోగొట్టుకున్న చాలామంది ఫిర్యాదు చేయడం లేదని ఫీడ్ బ్యాక్ రావడంతో మొబైల్ ట్రాకింగ్ సర్వీస్ వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం. ఫోన్లను వెతికి పట్టుకొని రెండు విడతల్లో మొబైల్ రికవరీ మేళా నిర్వహించి బాధితులకు మొబైల్స్‌ని అందించాం. ప్రజలకు నమ్మకం కలగడంతో ఫిర్యాదు చేసే వారి సంఖ్య పెరిగింది. మా ఐటీ కోర్ టీం అద్భుతంగా పనిచేస్తోంది.

– గౌతమి సాలి, ఎస్పీ

సినిమాకు వెళితే మొబైల్ పోయింది..



గతేడాది మార్చి నెలలో 'ఆర్ఆర్ఆర్' మూవీ టికెట్ కోసం లైన్‌లో నిలుచుంటే నా మొబైల్ దొంగిలించారు. ఫోన్ విలువ రూ.15 వేలు. అదేరోజు అచ్యుతాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాను. గత ఏడాది నవంబర్‌లో కొత్తగా రూపొందించిన పోలీస్ వాట్సాప్ నంబరుకు 'హాయ్' అని మెసేజ్ చేశాను. రికవరీ చేసి ఈ రోజు నా ఫోన్ అందజేయడం చాలా ఆనందంగా ఉంది. ఎస్పీ మేడమ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు.

– కె.ఎస్.ప్రసాద్, పెప్సీ కంపెనీలో ఉద్యోగి, అచ్యుతాపురం

నిజంగా ఆశ్చర్యమేసింది..



విశాఖలో నేను బీటెక్ చదువుతున్నాను. అనకాపల్లి నుంచి వైజాగ్ వస్తుండగా బస్సులో నా మొబైల్ దొంగిలించారు. దొంగతనం జరిగి ఏడాది అయింది. ఫిర్యాదు చేసినా ప్రయోజనం ఉండదనుకొని మొదట కంప్లయింట్ ఇవ్వలేదు. నా స్నేహితులు చెబితే.. గత ఏడాది నవంబర్‌లో పోలీసు వాట్సాప్ నెంబర్‌కి హాయ్ అని మెసేజ్ చేస్తే.. వివరాలు తీసుకున్నారు. నిన్న ఎస్పీ కార్యాలయం నుంచి ఫోన్ చేసి నా మొబైల్ దొరికిందని చెప్పడంతో షాక్ అయ్యాను. ఐటీ టీంకి ప్రత్యేక ధన్యవాదాలు.

– తేజశ్రీ, విద్యార్థిని, అచ్యుతాపురం

ఆటోలో వస్తుండగా దొంగిలించారు..




మాది విశాఖ జిల్లా ఆనందపురం. మా అమ్మమ్మ వారి ఊరు పరవాడ. అక్కడే ఆటోలో వస్తుండగా నా మొబైల్ దొంగిలించారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. పోలీస్ వాట్సాప్‌కు మెసేజ్ చేసి, వివరాలు ఇచ్చాను. ఫోన్ దొరుకుందనుకోలేదు. మళ్లీ నా మొబైల్ నాకు చేరతంతో ఎంతో ఆనందంగా ఉంది.

– హేమలత, ఆనందపురం

గౌరీశ్వరులకు పూలంగి సేవ



వెండినాగాభరణం, పుష్పాలంకరణలో శివలింగం



గౌరీదేవికి ఆభరణాలు, పూలతో అలంకరణ

- ఆరు రోజులపాటు సాగిన శివరాత్రి ఉత్సవాలు
- కనువిందు చేసిన పుష్పాలంకరణ

చోడవరం : స్వయంభూ గౌరీశ్వర స్వామి కల్యాణ శివరాత్రి మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం, శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్తరాంధ్ర జిల్లాలో పేరుగాంచిన చోడవరం శ్రీ స్వయంభూ గౌరీశ్వరస్వామివారి కల్యాణ శివరాత్రి మహోత్సవాలు ఈ నెల 16న ప్రారంభమై ఆరు రోజులపాటు ఘనంగా జరిగాయి. ముగింపు రోజైన మంగళవారం రాత్రి స్వామివారి పూలంగి సేవను కనువిందుగా నిర్వహించారు. గౌరీశ్వరస్వామివారిని, పార్వతీదేవిని రంగు రంగుల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి శివలింగానికి వెండి నాగాభరణం తొడిగారు. మహాలింగంతోపాటు పక్కనే కొలువుదీరిన పార్వతీ దేవి విగ్రహానికి వెండి, బంగారు ఆభరణాలు, పూలతో ముస్తాబు చేశారు. ఆలయ అర్చకులు కొడమంచి చలపతి, వేదపండితులు ప్రత్యేక పూజలతో పూలంగి సేవ నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఊయలలో శ్రీ గౌరీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను అధిష్టింపజేసి రకరకాల పండ్లు, పూలు, స్వీట్లతో స్వామివారికి ఊంజల్ సేవ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొని స్వామివారిని పూజించారు.

అలరించిన సురభి నాటకాలు

ఉత్సవాల ప్రారంభం నుంచి హైదరాబాద్‌కు చెందిన సురభి నాట్యమండలి ఆరు రోజుల పాటు ఏడు నాటకాలను ప్రదర్శించారు. మంగళవారం రాత్రి మాయాబజార్ నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. సినీ సెట్టింగ్‌లతో ప్రదర్శించిన సురభి నాటకాలను చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున వచ్చారు. ముగింపు ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కోలాటాలు, సంప్రదాయ నృత్యప్రదర్శనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలను ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు పప్పల జయదేవ్, ఎంపీపీ గాడి కాసు, ఉత్సవ కమిటీ చైర్మన్ గూనూరు సత్తిబాబు, దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి పర్యవేక్షించారు.

నేడు కీలక అభ్యర్థుల నామినేషన్లు

- భారీ ర్యాలీతో నామినేషన్ దాఖలు చేయనున్న వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్
- టీడీపీ, బీజేపీ మద్దతు అభ్యర్థులు కూడా..
- రేపటితో ముగియనున్న నామినేషన్ల పర్వం

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఆఖరి రోజు సమీపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీల మద్దతు అభ్యర్థులు నామినేషన్లకు వేసేందుకు బుధవారం సుముహూర్తంగా నిర్ణయించుకున్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ భారీ ర్యాలీగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. టీడీపీ, బీజేపీ మద్దతు అభ్యర్థులు బుధవారమే నామినేషన్లు దాఖలు చేయనున్నారు. మంగళవారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. నగరానికి చెందిన బొడ్డేడ చంద్రకళ పద్మావతి, కుందేటి సూర్య వెంకట సుభాష్ చంద్ర, శ్రీకాకుళం జిల్లా పొందూరుకి చెందిన ఎస్‌వీజే ప్రతాప్‌కుమార్‌లు నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థిగా బరిలో ఉన్న సీతంరాజు సుధాకర్ ఇప్పటికే ప్రచారంలో దూసుకుపోతున్నారు. బుధవారం నామినేషన్ వేసేందుకు ముహూర్తం నిర్ణయించారు. కార్పొరేటర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ ముఖ్యనాయకులు, శ్రేణులతో కలిసి సంపత్‌వినాయక్ టెంపుల్‌లో ముందుగా పూజలు నిర్వహించి.. అక్కడి నుంచి భారీ ర్యాలీతో కలెక్టరేట్‌కు చేరుకొని నామినేషన్ దాఖలు చేయనున్నారు. అదేవిధంగా.. టీడీపీ మద్దతు అభ్యర్థి చిరంజీవిరావు, బీజేపీ మద్దతు అభ్యర్థి పీవీఎన్ మాధవ్ కూడా ర్యాలీగా బయలుదేరి నామినేషన్లను బుధవారం వేయనున్నట్లు ఆయా పార్టీ వర్గాలు వెల్లడించాయి. వీరితో పాటు టీడీపీ రెబల్ అభ్యర్థి ఈర్ల శ్రీరాములు కూడా నామినేషన్ దాఖలు చేయనున్నారు. మొత్తంగా ఇప్పటివరకు ఆరుగురు అభ్యర్థుల నుంచి 10 సెట్ల నామినేషన్లు అందాయి.

విశాఖ ప్రత్యేకతను చాటిచెబుదాం



ఏయూ ఇన్‌గేట్ వద్ద పనులు పరిశీలిస్తున్న శ్రీలక్ష్మి

దాబాగార్డెన్స్ (విశాఖ): జీ–20 సదస్సుకు విచ్చేస్తున్న దేశ విదేశీ ప్రతినిధులకు విశాఖ ప్రత్యేకత, మన సంస్కృతిని చాటి చెప్పాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ కార్యదర్శి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి అధికారులను ఆదేశించారు. సీడీఎంఏ ప్రవీణ్‌కుమార్, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు, ఏపీ గ్రీన్ కార్పొరేషన్ ఎండీ రాజశేఖర్‌రెడ్డితో కలిసి పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీ–20 సదస్సుకు దేశ విదేశీ ప్రతినిధులు విశాఖ నగరానికి విచ్చేస్తున్నందున.. వివిధ ఆకృతులతో కూడిన బొమ్మలు, అలంకరణ, విద్యుత్ దీపాలంకరణ, రంగు రంగుల పెయింటింగ్‌లు, వివిధ ఆకృతులతో కూడిన మొక్కలు, పరిశుభ్రంగా రోడ్లు, ఫుట్‌పాత్‌లు కనిపించాలన్నారు.

ఆలోచన.. ఆవిష్కరణ.. ఆశయసాధన

- నేడు, రేపు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన
- జీవీఎంసీ హైస్కూల్(మెయిన్)లో నిర్వహణ
- పటిష్ట ఏర్పాట్లు చేసిన జిల్లా విద్యాశాఖ



జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ముస్తాబవుతున్న జీవీఎంసీ మెయిన్ హైస్కూల్

అనకాపల్లి టౌన్: విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తి పెంచాలి. వారిలో దాగివున్న అంతర్గత శక్తుల్ని వెలికి తీయాలి. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో ఆలోచనలకు పదునుపెట్టాలి. వారిని ఆశయ సాధకులుగా తీర్చిదిద్దాలి. ఈ సదుద్దేశంతోనే ఏటా పాఠశాల విద్యార్థులకు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ప్రస్తుతం జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను బుధ, గురువారాల్లో నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ సమాయత్తమైంది. ఈ మేరకు ఇప్పటికే స్థానిక జీవీఎంసీ హైస్కూల్(మెయిన్)లో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసింది.

ఐదు కేటగిరీలు.. 120 ప్రాజెక్టులు

పర్యావరణ హిత వస్తువులు(ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్స్), హెల్త్ అండ్ క్లీన్లీనెస్(ఆరోగ్యం, పరిశుభ్రత), సాఫ్ట్‌వేర్ అండ్ యాప్స్, ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ చేంజ్(పర్యావరణం, వాతావరణ మార్పులు), మేథమెటికల్ మోడలింగ్ విభాగాల్లో ఈ ఏడాది పోటీలను నిర్వహించారు. మండల స్థాయి ప్రదర్శనలో 24 మండలాల నుంచి ఒక్కో కేటగిరీలో ఒక్కొక్కటి చొప్పున అత్యుత్తమమైన 120 ప్రాజెక్టులను జిల్లా స్థాయి వేదికపై రెండు రోజులపాటు ప్రదర్శించనున్నారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి, ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలోని లయోలా కళాశాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు పంపనున్నారు.

చైర్మన్‌గా కలెక్టర్.. సమన్వయకర్తగా డీఈవో

రెండు రోజులపాటు నిర్వహించనున్నఈ వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా కలెక్టరు రవి పట్టాన్‌శెట్టి చైర్మన్‌గా, జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. వీరితోపాటు ఉప విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్, జిల్లా విద్యాశాఖ ఏడీ–2 రవిబాబు ప్రాజెక్టుల ఎంపిక నుంచి, వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్ల వరకు ప్రతీదీ పర్యవేక్షిస్తున్నారు. కొత్తగా అనకాపల్లి జిల్లా ఏర్పడ్డాక తొలిసారి జరుగుతున్న వైజ్ఞానిక ప్రదర్శన కావడంతో అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ప్రాజెక్టుల్ని వేదిక ఆవరణలో ఎల్ఈడీ స్క్రీన్ల మీద ప్రత్యేకంగా ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేశారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ

పటిష్ట ఏర్పాట్లు

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్లు పూర్తయ్యాయి. తరచూ పర్యవేక్షిస్తున్నాం. మంగళ వారం రాత్రి కూడా పరిశీలించా. రిజిస్ట్రేషన్ నుంచి బహుమతల అందజేత, సాంస్కృతిక కార్యక్రమాల వరకు సుమారు 10 కమిటీలను ఏర్పాటు చేశాం. వీటికి ఇప్పటికే పలుమార్లు సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించిన అనుభవమున్న ఉపాధ్యాయుల్ని బాధ్యుల్ని చేశాం. రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో కూడా మన జిల్లాకు మంచి గుర్తింపు దక్కుతుందన్న నమ్మకం ఉంది.

– ఎం.వెంకటలక్ష్మమ్మ, డీఈవో, అనకాపల్లి

ధర్మానికి కేంద్రం భారత్

- దేశానికి ధర్మం, సంస్కృతి ప్రధానం
- కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి

ఏయూక్యాంపస్: ధర్మానికి ముఖ్య కేంద్రంగా భారతదేశం నిలుస్తుందని శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి అన్నారు. మంగళవారం బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పౌర అభినందన సభలో ఆయన నగర ప్రజలను ఉద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు. దేశానికి ధర్మం, సంస్కృతి ప్రధానమన్నారు. సమాజ హితం కోసం అధికారాలను వినియోగించాలని సూచించారు. విశాఖ నగర వైభవం పెరుగుతోందన్నారు. అంతర్జాతీయ సదస్సులకు వేదికగా విశాఖ నిలుస్తోందన్నారు. ధర్మప్రచారంతో పేరు వస్తుందన్నారు. ఆచార్య స్థానంగా ఆంధ్ర ప్రదేశ్ నిలుస్తుందన్నారు. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ అశాంతి, అలజడిని పారద్రోలేది ఆధ్యాత్మికతే నన్నారు. సనాతన హిందూ ధర్మపరిరక్షణకు కంచి కామకోటి పీఠం పనిచేస్తోందన్నారు. ధర్మ పరిరక్షణ, ధర్మ ప్రచారంతో స్వామీజీ వెంట నడుస్తామన్నారు. ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ స్వామీజీ రాకతో విశాఖ నగరం పునీతమైందన్నారు. ప్రభుత్వ పరంగా అవసరమైన సంపూర్ణసహకారం అందిస్తామన్నారు. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ ఆలయం అన్ని సమాజాలకు ఆశ్రయం కల్పిస్తుందన్నారు. సంప్రదాయాల పరిరక్షకులుగా స్వామీజీ నిలుస్తున్నారన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్ సోమయాజులు మాట్లాడుతూ విశాఖ నగరాన్ని దీవించాలని కోరారు. కార్యక్రమంలో బి.వెంకటరమణ, డాక్టర్ రవిరాజు, ఆచార్య పి.సోమరాజు, ఆచార్య పి.ఎస్ అవధాని, ఎం.ఆర్.కె.రాజు, డాక్టర్ ఆర్.సాంబమూర్తి, కె.చిరంజీవి, రాష్ట్ర బార్‌కౌన్సిల్ అధ్యక్షుడు గంట రామారావు, న్యాయవాదులు కృష్ణమోహన్, జె.పృధ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్తోత్ర రత్నావళి పుస్తకాన్ని స్వామీజీ చేతుల మీదుగా ఆవిష్కరించారు.



అనుగ్రహ భాషణం చేస్తున్న శంకర విజయేంద్ర సరస్వతి స్వామి

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయపడ్డ రాములు

చింతపల్లి రూరల్ : కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ద్విచక్ర వాహన దారుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు అందించిన వివరాలివి. చౌడుపల్లి గ్రామానికి చెందిన కొర్రాబు రాములు ద్విచక్ర వాహనంపై చింతపల్లి నుండి చౌడుపల్లి వెళ్తుండగా కాఫీ బోర్డు కార్యాలయం ఎదుట అటుగా వస్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో అతనికి కుడి కాలు విరిగిపోయింది.

దీంతో అక్కడ ఉన్న స్థానికులు హుటాహుటిన స్థానిక ఆసుపత్రికి తీసుకురాగా అక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని ఎస్ఐ రమణ తెలిపారు.

ఏరియా ఆస్పత్రిలో వృద్ధుడి మృతదేహం



కృష్ణ మృతదేహం

నర్సీపట్నం : మున్సిపాలిటీ కృష్ణాబజార్ మద్యం దుకాణానికి సమీపంలో మృతి చెంది ఉన్న వృద్ధుడు మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచామని టౌన్ సీఐ ఎస్.గణేష్ తెలిపారు. చనిపోయిన వ్యక్తి వయస్సు 72 ఏళ్లు ఉంటుందన్నారు. వృద్ధుడి వద్ద లభించిన ఆధార్‌కార్డులో అతని వివరాలు చింతపల్లి మండలం, లోతుగెడ్డ గ్రామానికి చెంది కటు మోహన్ కృష్ణగా ఉందన్నారు. బంధువుల కోసం విచారణ చేస్తున్నామన్నారు. బంధువులు ఎవరైనా వస్తే మృతదేహన్ని అప్పగిస్తామన్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

మోతుగూడెం: ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లా సబ్ కలెక్టర్ అక్షయ్ కుమార్‌తో పాటు ఒడిశా ఉన్నతాధికారులు బృందం మంగళవారం పొల్లూరు జలపాతాన్ని సందర్శించారు. ఈ నెల 27న జరిగే మన్యం కొండ జాతర ఏర్పాట్లను పరిశీలించారు. సీలేరు నది దాటే ప్రదేశంతో పాటు వనదేవతలు స్నానాలు చేయించే వాటర్ పాల్స్‌ను సందర్శించారు. ఆయన వెంట ఒడిశా పోలీసులు, రెవెన్యూ విభాగం యంత్రాంగం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మన ఐక్యతకు కారణం సంస్కృతే..

- గుండెల నిండా తెలుగు నిండి ఉండాలి
- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి



సదస్సు సంచికను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: భారతీయుల్లో ఎన్నో వైవిధ్యతలున్నా.. వారిని ఐక్యం చేస్తోందని మన సంస్కృతే అని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో ఏయూ తెలుగు విభాగం, సమైక్య భారతి సంయుక్తంగా నిర్వహిస్తున్న 'అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం-తెలుగు ప్రాశస్త్యం'ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మన గుండెల నిండా తెలుగు నిండి ఉండాలని సూచించారు. ప్రపంచానికి అనుగుణంగా మన జీవనం మారిపోతోందన్నారు. భాషకు మరింత మాధుర్యాన్ని జోడించే దిశగా యువత పనిచేయాలన్నారు. భవిష్యత్ తరానికి భాషను అందించే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ ఏయూ కళలకు నిలయమన్నారు. భాషాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. సమైక్య భారతి జాతీయ గౌరవ అధ్యక్షుడు మూర్తి రేమెళ్ల మాట్లాడుతూ భాషకు అంతర్జాతీయ వేదికలు కావాలన్నారు. పరిశోధకులకు చోదకశక్తిగా ఈ సదస్సు నిలుస్తుందన్నారు. తెలుగు విభాగాధిపతి ఆచార్య జర్రా అప్పారావు మాట్లాడుతూ జీవనదిగా మాతృభాష నిలుస్తుందన్నారు. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యుడు శలాక రఘునాథ శర్మ తెలుగు భాష గొప్పదనాన్ని వివరిస్తూ పరభాషల అవసరాన్ని తెలిపారు. తెలుగు జాతీయాలు, ఇతర జాతీయాలకు మధ్య తేడాలను వివరించారు. నూతన పదాలను తయారు చేసుకునే వెసులుబాటు తెలుగు భాషకే సాధ్యమన్నారు. పారిస్ నుంచి వచ్చిన తెలుగు భాషాభిమాని డేనియల్ నేజర్స్ దేవదేవ మహాదేవ శ్లోకంతో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తెలుగు ఉచ్ఛారణ చాలా గొప్పగా, అందంగా ఉంటుందన్నారు. ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య కె.శ్రీనివాస సాలూరు వాసూరావు, డాక్టర్ కె.రత్నశేఖర్, డాక్టర్ బూసి వెంకట స్వామి, డాక్టర్ ఎ.సీతారత్నం, విభాగ ఆచార్యులు, పరిశోధకులు పాల్గొన్నారు. సదస్సు ప్రత్యేక సంచికను వీసీ ప్రసాద రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం అతిథులను వర్సిటీ తరఫున ఘనంగా సత్కరించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రకృతి వ్యవసాయం జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ స్వామినాయుడు



ముకుందపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఏపీఎం స్వామినాయుడు

మాడుగుల రూరల్: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించొచ్చునని ప్రకృతి వ్యవసాయం జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ ఆర్.వి.స్వామినాయుడు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్)లో భాగంగా మంగళవారం ముకుందపురంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పొలం నాలుగు వైపులా ఆయన పరిశీలించారు. అనంతరం పంటకు వచ్చే తెగుళ్లు, పొలంలో గుర్తించిన అనుకూల, ప్రతికూల అంశాలు చార్టులపై వేసి రైతులకు అవగాహన కల్పించారు. మిత్రపురుగులు ఎక్కువగా ఉంటే వేపనూనె పిచికారీ చేయాలని సూచించారు. పంట తీసిన తర్వాత భూమి ఖాళీగా ఉండకుండా 365 రోజులు కప్పి ఉంచేలా ప్రీ మాన్ సోన్ డ్రై సోయింగ్ 30 రకాల విత్తనాలు చల్లుకోవాలని, ఈ విధంగా చల్లుకోవడం వల్ల భూమి సారవంతంగా తయారై తేమ ఉంటుందన్నారు. సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయన్నారు. దిగుబడి పెరుగుతుందన్నారు. సూర్యరశ్మి భూమి మీద పడకుండా ఉంటుందన్నారు. ఈ విధంగా చేసుకోవడం వల్ల ఖరీఫ్ సీజన్‌లో డీఏపీ యూరియా వంటి ఎరువులు వేయాల్సిన అవసరం ఉండదన్నారు. మినప పంట పంటకోత ప్రయోగాలు గురించి మాస్టర్ ట్రైనీ రాము వివరించారు. ఎల్టీలు గండి శ్రీనివాసరావు, చిన్నంనాయుడు, శ్రీనాథు నర్సింగరావు, ఎస్‌హెచ్‌జీ లీడర్లు పాల్గొన్నారు.

దిగుడుపుట్టులో మశూచి



మశూచి వ్యాధి సోకిన చిన్నారులు, మహిళ

హుకుంపేట: మండలంలోని దిగుడుపుట్టు గ్రామంలో తొమ్మిది మందికి మశూచి వ్యాధి సోకింది. గ్రామానికి చెందిన వంతాలకొండబాబు, కొర్ర రస్మి, గొల్లెల వరప్రసాద్, కొర్ర రాహుల్, తాంగుల జానకమ్మ, హర్ష వర్ధన్, శివసుమన్, మధుసూదన్ వ్యాధి బారిన పడ్డారు. వీరిలో ఎక్కువ మంది చిన్నారులు ఉన్నారు. వైద్యసిబ్బంది మందులు అందజేసినా వ్యాధి తీవ్రత తగ్గుముఖం పట్టడం లేదని గ్రామస్తులు తెలిపారు. మెరుగైన వైద్యం అందించాలని వారు కోరుతున్నారు.

పెదపేటలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు



సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన వాహనాలు



పెదపేట భూముల్లో తవ్వకాలు చేస్తున్న ప్రాంతం

- మైనింగ్ అధికారుల దాడి
- రెండు ట్రాక్టర్లు, ఒక పొక్లెయిన్ సీజ్

రోలుగుంట: మండలంలోని పెదపేట సమీపంలో జరుగుతున్న అక్రమ మట్టి, గ్రావెల్ తవ్వకాలపై అనకాపల్లి మైనింగ్ అధికారులు సోమవారం అర్ధరాత్రి దాడులు చేశారు. ఆ సమయంలో అక్కడున్న ఒక పొక్లెయిన్, రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. వివరాలివి. ఎం.కె.పట్నం శివారు పేదపేట సమీపంలో 37-3 సర్వే నంబర్‌లో గల సుమారు మూడు ఎకరాల జిరాయితీ భూమిలో అనధికారికంగా మట్టిని తవ్వి వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలించి అమ్మకాలు చేసుకొని కాసులు చేసుకుంటున్నారు. స్థానికులు దీనిపై సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ వెంకటేశ్వరరావు ఆదేశాలతో వీఆర్వో రాజలమ్మ అక్రమ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలపై నివేదిక తయారు చేసి మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మైనింగ్ అధికారులు సోమవారం అర్ధరాత్రి దాడి జరిపి తవ్వకాల ప్రాంతంలో వాహనాలను సీజ్ చేశారు.

వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మైనింగ్ ఏడీఏ ఎ.జి.రవివర్మ విలేకరులతో మాట్లాడుతూ సీజ్ చేసిన వాహనాలపై కేసు నమోదు చేశామన్నారు. రెవెన్యూ అధికారులలో ఈ విషయమై చర్చించి అపరాధ రుసుము వసూలు చేయడం జరుగుతుందన్నారు. అలాగే భూ యజమానిని కూడా విచారించి కేసు నమోదు చేస్తామన్నారు.

రోగులకు అందుబాటులో ఉండాల్సిందే

నక్కపల్లి ఆస్పత్రిని తనిఖీ చేసిన జిల్లా కోఆర్డినేటర్



వైద్యులకు సూచనలు ఇస్తున్న వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ రమేష్

నక్కపల్లి: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ రమేష్ హెచ్చరించారు. మంగళవారం ఆయన నక్కపల్లి ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని వార్డుల్లో పర్యటించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఫార్మసీ, స్టోర్‌రూంలు, ఆపరేషన్ థియేటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందినుద్దేశించి మాట్లాడుతూ ఆస్పత్రిలో పనిచేసే వైద్యులు, పారామెడికల్ సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. 24 గంటలూ వైద్య సేవలందించే ఆస్పత్రి కావడంతో డ్యూటీల ప్రకారం రోగులకు అత్యవసర వైద్య సేవలు అందించాల్సి ఉందన్నారు. రోగుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. ఇక్కడ అన్ని సదుపాయాలు ఉన్నప్పటికీ వైద్య సిబ్బంది పని తీరు మాత్రం సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏజెన్సీలో నెలకు 80కి పైగా శస్త్రచికిత్సలు చేస్తున్నారని, మైదాన ప్రాంతంలో జాతీయ రహదారికి ఆనుకున్న ఈ ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు పెద్దగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కుటుంబ నియంత్రణా శస్త్రచికిత్సలతోపాటు, సిజేరియన్లు, ఇతర చిన్నపాటి చికిత్సలు చేసేందుకు అవసరమైన అన్ని సదుపాయాలు ఇక్కడ ఉన్నాయన్నారు. ఈ ఆస్పత్రిని 50 పడకల స్థాయికి పెంచి అదనపు భవనాలు నిర్మించారని, పలువురు వైద్య నిపుణులు పని చేస్తున్నా ఆ స్థాయిలో వైద్య సేవలు అందడం లేదని పెదవి విరిచారు. ఇకనుంచి సిబ్బంది పూర్తి స్థాయిలో వైద్య సేవలపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఆస్పత్రిలో పనిచేసే డాక్టర్లతోపాటు, ప్రతి సిబ్బంది ఐడీ కార్డు ధరించాలన్నారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మరుగుదొడ్ల నిర్వహణ తాగునీరు, వాడుకనీరుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జనార్దన్, వైద్యులు ఈశ్వరప్రసాద్, జయలక్ష్మి, వంశీకృష్ణ ఉన్నారు.

26న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమీక్ష

హాజరు కానున్న పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి



సర్పంచ్, ఎంపీటీసీలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

కె.కోటపాడు: ఈ నెల 26న కె.కోటపాడులో వైఎస్సార్‌సీపీ మాడుగుల నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం జరగనున్నట్లు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. కె.కోటపాడులో మంగళవారం సర్పంచ్, ఎంపీటీసీ, పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. నాలుగు మండలాల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీ, ముఖ్య నాయకులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మండలంలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల పురోగతిని పార్టీ నాయకులను అడిగి తెలుసుకున్నారు. వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయానికి కృషి చేయాలి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో పార్టీ బలపర్చిన సీతంరాజు సుధాకర్ విజయానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ, నాయకులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. వచ్చే నెల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుధాకర్‌కు పట్టభద్రులు ఓటు వేసేలా చైతన్యవంతం చేయాలన్నారు.

ఈ గెలుపును సీఎం జగన్‌కు బహుమతిగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, సర్పంచ్‌లు వేచలపు దొరబాబు, బండారు ముత్యాలనాయుడు, బొళెం సందీప్, బండారు దేముళ్లు, ఆదిరెడ్డి సన్యాసినాయుడు, బొళెం కృష్ణారావు, అవుగడ్డ సొంబాబు, ఎంపీటీసీలు ఏటుకూరి రాజేష్, వర్రి రామునాయుడు, లెక్కల గౌతమి, నెక్కల గోపి పాల్గొన్నారు.

బావిలోకి దూకి వృద్ధుడి ఆత్మహత్య



మృతుడు కొత్తలంక నూకరాజు

యలమంచిలి : భార్య చనిపోయిందని మనస్థాపంతో వృద్ధుడు బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ అడిషినల్ ఎస్ఐ కె.వెంకటరావు తెలిపిన వివరాలివి. యలమంచిలి పట్టణంలో గాంధీనగర్ వీధికి చెందిన కొత్తలంక నూకరాజు భార్య ఇటీవలే మరణించడంతో మనస్థాపం చెంది మంగళవారం ఉదయం తన ఇంటి సమీపంలో బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు స్థానిక అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం తెలపగా వారు హుటాహుటిన వచ్చి సహాయక చర్యలు చేపట్టి నూకరాజు మృతదేహన్ని వెలికి తీసి బంధువులకు అప్పగించారు. మృతుడు నూకరాజుకు నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మూడో కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సుందరీకరణ పనుల్లో రాజీపడేదే లేదు

జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు



గ్రీన్‌పార్క్ ఎలక్ట్రికల్ ఆఫీస్ వద్ద నిరూపయోగంగా ఉన్న పోల్స్‌ను తొలగించాలని ఆదేశిస్తున్న కమిషనర్

డాబాగార్డెన్స్: వచ్చే నెలలో నిర్వహించనున్న రెండు అంతర్జాతీయ సదస్సుల్లో భాగంగా చేపడుతున్న సుందరీకరణ పనుల్లో రాజీపడేదే లేదని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం సిరిపురం ద్రోణంరాజు సర్కిల్, గవర్నర్ బంగ్లా, గ్రీన్‌పార్క్, నౌరోజీరోడ్డు, కలెక్టర్ ఆఫీస్, నోవాటెల్ వరకు పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర సుందరీకరణ పనుల్లో రాజీ లేకుండా పని చేయాలని, మార్చి నెలలో జరిగే సదస్సులకు వచ్చే అతిథులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నగర సుందరీకరణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డుకిరువైపులా ఆకర్షణీయంగా మొక్కలు, పచ్చదనం పెంపొందించాలని మొక్కల విభాగం అధికారులను ఆదేశించారు. వినియోగంలో లేని ఎలక్ట్రికల్ పోల్స్, గ్రీన్‌పార్క్ ఎదురుగా ఎలక్ట్రికల్ కార్యాలయం ప్రహరీ వద్ద ఉన్న ఎలక్ట్రికల్ పోల్స్‌ను ఈపీడీసీఎల్ అధికారులతో మాట్లాడి వెంటనే తొలగించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మీడియం పోల్స్‌కు ఉన్న కేబుల్ వైర్లను, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని, చూసేందుకు ఆకర్షణీయంగా కనిపించే విధంగా వీఐపీ రోడ్డు తీర్చిదిద్దాలని, రోడ్లపై జీబ్రా లైన్లు, సైడ్‌లైను వేయాలని, ప్రాంతాలను తెలిపే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 29వ వార్డు పరిధిలో పారిశుద్ధ్య పనులు సరిగ్గా నిర్వహించనందున ఆ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ సస్పెండ్ చేయాలని అదనపు కమిషనర్ వి.సన్యాసిరావును ఆదేశించారు. అనంతరం నోవాటెల్ బీచ్‌రోడ్డు వద్ద ఉన్న వాహనాల పార్కింగ్ ప్రాంతంలోనూ, పార్కులో జరుగుతున్న ఇంజనీరింగ్ పనులు పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. పర్యటనలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, పర్యవేక్షక ఇంజనీరు సత్యనారాయణరాజు, కార్యనిర్వాహక ఇంజనీర్లు శ్రీనివాస్, రమణ, ఏఎంఓహెచ్ డాక్టర్ ఎన్.కిశోర్, ఏసీపీలు వేంకటేశ్వరరావు, వినయ్‌ప్రసాద్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ సత్యనారాయణ, ప్రజారోగ్యపు అధికారులు పాల్గొన్నారు.

మళ్లీ తెరపైకి చింతపల్లి ట్రెజరీ కుంభకోణం కేసు

విచారణ చేపట్టిన డిప్యూటీ డైరెక్టర్ శేషారెడ్డి

మహారాణిపేట (విశాఖ): వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగుల పేరిట దొంగ బిల్లులు పెట్టి నిధులు కాజేసిన చింతపల్లి ట్రెజరీ కుంభకోణం కేసు మళ్లీ తెరమీదకు వచ్చింది. వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శేషా రెడ్డి శాఖాపరమైన విచారణ చేపడుతున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాంట్రాక్టు ఉద్యోగుల పేరిట 2013 నవంబర్‌లో దొంగ బిల్లులు పెట్టి సుమారు రూ.13 కోట్లు స్వాహా చేశారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పెట్టిన బిల్లులను ట్రెజరీ అధికారులు ఆమోద ముద్ర వేసి మొత్తం నిధులను దోచుకున్నారు. ఈ వ్యవహారం 2015లో వెలుగు చూసింది. ఈ నేపథ్యంలో రెండు శాఖలతోపాటు ఈ కేసుతో సంబంధం ఉన్న ఇతర అధికారులు మొత్తం 83 మందిపై కేసులు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇందులో కొంత మందిపై వేటు వేశారు. మరికొందరు రిటారయ్యారు. ఇంకొందరు మళ్లీ పోస్టింగులు తెచ్చుకున్నారు. ఇద్దరు ముగ్గురు ఉద్యోగులు మరణించారు. అయితే రికవరీ ఏ మాత్రం జరగలేదు. సుదీర్ఘ విరామం తర్వాత వైద్య ఆరోగ్యశాఖ మళ్లీ ఈ కేసు విచారణ ప్రారంభించింది. డిప్యూటీ డైరెక్టర్ శేషారెడ్డి అప్పటి డీఎంహెచ్‌వో శ్యామల, పాడేరు అడిషనల్ డీఎంహెచ్‌వో స్వప్నకుమారి, డాక్టర్ మురళీమోహన్ రావు, విశ్రాంత ఏవో శ్రీనివాస్, సిబ్బంది నిర్మల తదితరులను విచారించారు. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని విచారణకు రావాలని నోటీసులు జారీ చేశారు. మరో రెండు రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది.

డోలీలో తరలించినా దక్కని శిశువు

- గర్భిణికి అత్యవసర వైద్యం
- తల్లి ప్రాణాలను కాపాడిన సిబ్బంది
- నెలలు నిండకపోవడమే కారణం



మృతి చెందిన శిశువు

హుకుంపేట: పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఎంతో కష్టపడి డోలీలో ఆస్పత్రికి తరలించినా నెలలు నిండకపోవడంతో శిశువు ప్రాణాలు దక్కలేదు. తల్లి ప్రాణాలను మాత్రమే వైద్యసిబ్బంది కాపాడగలిగారు. వివరాలిలావున్నాయి. మండలంలో మారుమూల కొండ ప్రాంతమైన తీగలవలస పంచాయతీ పనసబంద గ్రామానికి చెందిన వంతాల భానుకు మంగళవారం పురిటినొప్పులు మొదలయ్యాయి. దీంతో భర్త నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. రహదారి లేనందున వాహనం గ్రామానికి వెళ్లలేదు. దీంతో కుటుంబసభ్యులు పనసబంద నుంచి డోలీలో తీగలవలస గ్రామం వరకు తీసుకువచ్చారు. అక్కడినుంచి ఆటోలో స్థానిక ఆస్పత్రికి తీసుకువచ్చారు. పురిటినొప్పులు ఎనిమిదో నెలలో వచ్చినందున బిడ్డం అడ్డం తిరగడంతో వైద్యసిబ్బంది అతికష్టంమీద ప్రసవం చేశారు. అప్పటికే మృతి చెందిదని వైద్యసిబ్బంది తెలిపారు. గ్రామానికి రహదారి సౌకర్యం లేనందున అంబులెన్సు వచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికైనా రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు.



పనసబంద గ్రామం నుంచి గర్భిణిని డోలీలో మోసుకొస్తున్న కుటుంబ సభ్యులు,గ్రామస్తులు

ప్రజాధనం 'తుప్పు'పాలు

మూలకు చేరిన ప్రభుత్వ వాహనాల నుంచి ఆదాయం పొందడంలో అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారు. దీంతో విలువైన వాహనాలు సైతం నేడు తుప్పు పట్టాయి. కనీసం వీటిని తుక్కు కింద అమ్ముకున్నా.. నాలుగు రూపాయలు ఖజానాకు జమ చేయొచ్చు. వాటి పార్కింగ్ కోసం వినియోగిస్తున్న స్థలాన్ని ప్రత్యామ్నాయ ప్రయోజనాలకు వాడొచ్చు. ఆ పని చేయడానికి కూడా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో ప్రజాధనం 'తుప్పు'పట్టి పోతోంది.


జీవీఎంసీ కార్యాలయంలో మూలనపడ్డ వాహనాలు


మూలకు చేరిన సమాచార శాఖకు చెందిన మినీ బస్సు

- ఏళ్ల తరబడి వినియోగంలో లేకపోవడంతో మూలకు చేరిన వైనం
- తుక్కు కింద వేలానికి చర్యలు తీసుకోని యంత్రాంగం

తుమ్మపాల : ప్రభుత్వ అధికారులకు ప్రభుత్వం కేటాయించిన వాహనాలు కాలం చెల్లడంతో మూలకు చేరాయి. కొన్నేళ్ల క్రితం అధికంగా జీపులను ప్రభుత్వ అధికారులు వినియోగించేవారు. క్రమేనా అవి పాడవడం, తరచూ రిపేర్లకు రావడంతో మరమ్మతులు చేపట్టకుండా వదిలేశారు. దీంతో పట్టణం, మండలంలోని ఆయా కార్యాలయాల్లో ఇలాంటి వాహనాలు మూలకు చేరి తుప్పుపట్టాయి. కొన్ని విభాగాలకు ప్రభుత్వం కొత్త వాహనాలను మంజూరు చేయకపోవడంతో అద్దె వాహనాలతో తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. దీంతో మూలన పడ్డ పాతవాహనాలను పట్టించుకునే నాథుడు లేక వాహనాలు ఎందుకూ కొరగాకుండా మారుతున్నాయి.

అన్ని విభాగాల్లోనూ ఇదే తీరు

మున్సిపాలిటీగా ఉన్న అనకాపల్లి పట్టణం జీవీఎంసీలో విలీనం అయినప్పటి నుంచి మరమ్మతులకు గురైన వాహనాలను మూలన పడేశారు. జీవీఎంసీ అనకాపల్లి జోన్ కార్యాలయంలో రెండు ట్రక్కులు, ఒక ట్రాక్టర్, ఒక ఆటో, ట్రాక్టర్ తొట్టి వృధాగా మూలనపడి ఉన్నాయి. మండల ప్రధాన కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవోలు వినియోగించిన జీపులు కూడా ఆయా కార్యాలయాల్లో తుక్కుగా మారాయి. పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ కార్యాలయంలో ఒక వాహనం మరమ్మతులకు నోచుకోక మూలకు చేరింది. శంకరంలోని కలెక్టరేట్ వద్ద సమాచార శాఖకు చెందిన మినీ బస్సు పరిస్థితి కూడా అంతే. ఉద్యానవన శాఖ కార్యాలయంలో కూడా పాత ప్రభుత్వ వాహనాలు మూలనపడ్డాయి. వీటిని పట్టించుకున్న పాపాన పోవట్లేదు.

తుక్కు కూడా ఆదాయ వనరే..

గడువు తీరిన ప్రభుత్వ వాహనాలను ఎక్స్ఛేంజ్‌లో ఇచ్చి కొత్త వాహనాలు కొనుగోలు చేయొచ్చు. అయితే గత కొన్నేళ్లుగా ప్రభుత్వాలు కొత్త వాహనాల కొనుగోళ్లపై పెద్దగా ఆసక్తి చూపట్లేదు. కనీసం పాత వాహనం స్థానంలో కొత్త వాహనాన్ని ఏర్పాటు చేశాకైనా.. సదరు పాత వాహనాన్ని వేలం వేస్తే కాస్త మంచి ఆదాయమే ప్రభుత్వానికి వచ్చేది. వినియోగానికి పనికి వచ్చే వాటికి మరమ్మతులు చేపట్టి, కాలం చెల్లిన వాటికి వేలం వేస్తే సరిపోతుంది. అయితే సదరు ప్రభుత్వ యంత్రాంగాలు దీన్ని పెద్దగా పట్టించుకోకపోవడంతో ఇపుడు తుప్పు పట్టి తుక్కు కింద మారాయి. కనీసం ఇపుడైనా వీటిని వేలం వేస్తే ఎంతో కొంత ఆదాయం సమకూరే అవకాశముంది.

మెకానికల్ విభాగానిదే ఆ బాధ్యత

మూలన పడ్డ, మరమ్మతులకు గురైన వాహనాల బాధ్యత ప్రధాన కార్యాలయంలోని మెకానికల్ విభాగం పరిధిలోది. మా దగ్గర ఐదు వాహనాలు వినియోగంలో లేకపోవడంతో మూలకు చేరాయి. వాటిని తుక్కుకు వేయాలంటే మెకానికల్ విభాగం వారు నివేదిక ఇవ్వాలి. ఆర్టీవో వద్ద విలువ కట్టి తుక్కుకు వేలం వేస్తారు. తుక్కు వాహనాలపై నివేదికను తయారుచేసి ప్రధాన కార్యాలయానికి పంపించి, చర్యలు తీసుకుంటాం.

– టి.వెంకటరమణ, జెడ్సీ, అనకాపల్లి జోన్

కళాశాలల్లో విద్యార్థుల కమిటీలు

- ఒక్కో కమిటీలో ఐదుగురు సభ్యులు
- పట్టణంలోని 19 కళాశాలల్లో ఏర్పాటు


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీను

అనకాపల్లిటౌన్ : కష్టపడి చదవడం కంటే ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పట్టణ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి సీఐ టి.శ్రీను అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు హిమశేఖర్ డిగ్రీకళాశాలలో విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్, ఇతర సమస్యలపై మంగళవారం కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో 19 కళాశాలలు ఉన్నాయని, ఒక్కొక్క కళాశాలలో ఒక అధ్యాపకురాలు, ఒక అధ్యాపకుడు, ఒక సీనియర్ విద్యార్థి, ఒక జూనియర్ విద్యార్థితో పాటు పట్టణ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్‌తో కలిసి ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కళాశాలలో బహిరంగంగా తమ సమస్యల్ని చెప్పుకోలేని విద్యార్థుల కోసం ఫిర్యాదుల బాక్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. వారానికోసారి ఐదురుగు కమిటీ సభ్యుల సమక్షంలో ఫిర్యాదుల బాక్స్‌ను తెరిచి, వివరాలను గోప్యంగా ఉంచి సమస్య పరిష్కారానికి కృషి చేయనున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటుపడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హితవుపలికారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దని హెచ్చరించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల రవాణాపై ఎలాంటి సమాచారమున్నా, సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు అందిస్తే, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాడి పశువుల కొనుగోలుకు వడ్డీలేని రుణాలు

విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు


పాడి రైతులకు రుణాల చెక్కును అందిస్తున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు

కశింకోట : విశాఖ డెయిరీ ద్వారా పాడి రైతులకు మేలు జాతి పశువుల కొనుగోలుకు వడ్డీ లేని రుణాలు అందించనున్నట్లు డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు అన్నారు. మండలంలోని తాళ్లపాలెం, ఉగ్గినపాలెం, లాలంకొత్తూరు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల పని తీరును క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భవిష్యత్‌లో విశాఖ డెయిరీ చేపట్టనున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. పాడి రైతులకు మేలు జాతి పశువుల కొనుగోలుకు ఇవ్వనున్న వడ్డీ లేని రుణాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. డెయిరీకి పాల ఉత్పత్తిని పెంచి మరింత అభివృద్ధికి దోహదపడాలన్నారు. అలాగే సిబ్బంది పాల సేకరణ జరుపుతున్న తీరును పరిశీలించి మెరుగుపరచడానికి పలు సూచనలు చేశారు.

ఎల్.కొత్తూరులో పాడి రైతులకు రుణాలు

లాలం కొత్తూరు పాల సంఘం పరిధిలోని 16 మంది రైతులకు స్థానికంగా పాడి పశువుల కొనుగోలుకు రూ.8.80 లక్షల రుణాల చెక్కులను అందించారు. ఈ సొమ్ము ఆన్‌లైన్ ద్వారా లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాలకు జమవుతాయని రమణారావు తెలిపారు. పాల సంఘాల అధ్యక్షులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాళ్లపాలెం హైస్కూల్‌కు ఫ్యాన్ల వితరణ


సీలింగ్ ఫ్యాన్లు అందిస్తున్న వెంకటరావు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సత్యసాయి భజన మండలి రెండు సీలింగ్ ఫ్యాన్లను మంగళవారం అందించింది. విద్యార్థుల సౌకర్యార్థం వీటిని స్కూల్లో ఏర్పాటు చేసేందుకు భజన మండలి అధ్యక్షుడు ముక్కామల వెంకటరావు పాఠశాల హెచ్ఎం వైవీవీ లక్ష్మీ సుమన్‌కు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, పాల సంఘం అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గుమ్మడి గోవింద, మాజీ చైర్మన్ గుమ్మడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డీఈవోకు యూటీఎఫ్ నేతల అభినందన


డీఈవో వెంకటలక్ష్మమ్మకు పుష్పగుచ్ఛం, డైరీ అందిస్తున్న యూటీఎఫ్ నేతలు

అనకాపల్లిటౌన్ : విద్యా వ్యవస్థ బలోపేతానికి ఉపాధ్యాయ సంఘాలు ప్రధాన భూమిక పోషించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి డీఈవోను అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి, గౌరవాధ్యక్షుడు ఎస్.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి, కార్యదర్శి జి.ఎస్.ప్రకాష్, మండల నాయకులు దేవుడునాయుడు, ఎస్.నూకరాజు, కె.కామరాజు, రమేష్, రవి, శ్రీను, స్వామి, అలివేలు, అజయ్, రేఖ, అరుణ, తేజ, వర్ధన్ పాల్గొన్నారు.

సీపీఐ కార్యదర్శి రామకృష్ణ రాక నేడు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బుధవారం ఉదయం 10 గంటలకు పర్యటించనున్నట్లు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు సంబంధించిన ప్రాంతాన్ని ఆయన సందర్శించి, ప్రాజెక్టు స్థితిగతులు, స్థానికుల సమస్యలను తెలుసుకుంటారని పేర్కొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 7,659 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,550	4,070
మొదటి రకం	3,320	3,570
రెండో రకం	3,040	3,480
మూడోరకం	2,850	3,030

అనకాపల్లి సినిమాలు

సార్	- రాజా
అమిగోస్	-సత్యనారాయణ స్క్రీన్-1
క్యాంటమేనియా(3డీ)	- సత్యనారాయణ స్క్రీన్-2
వినరో భాగ్యము విష్ణుకథ	-షిర్డిసాయి
క్యాంటమేనియా(3డీ)	-పర్తిసాయి
వీరసింహారెడ్డి	-వెంకటేశ్వర
శ్రీదేవి శోభన్‌బాబు	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 80 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు , బీ పాజిటివ్-38 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-25 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 394 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 381 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (9441108144)ని సంప్రదించవచ్చు.

అమ్మమాటే.. మాతృభాష

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం


ప్రముఖ రచయిత్రి పెబ్బిలి హైమావతిని సత్కరిస్తున్న తెలుగు భాష పరిరక్షణ సమితి సభ్యులు


విజేతలతో నిర్వాహకులు

అనకాపల్లి రూరల్ : మాతృభాష సహజంగా అబ్బుతుంది. అప్రయత్నంగా వస్తుంది. అమ్మమాటే మాతృభాష అందుకే ప్రతి బిడ్డ అమ్మను కాపాడుకున్నట్టే మాతృభాషను కూడా కాపాడుకోవాలి.. అని పలువురు తెలుగు రచయితలు, అధ్యాపకులు, తెలుగు భాష పరిరక్షణ సమితి సభ్యులు విద్యార్థులకు తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. మంగళవారం మండలంలోని రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అనకాపల్లి తెలుగు భాష పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. విశాఖకు చెందిన ప్రముఖ రచయిత జయంతి ప్రకాశ శర్మ, ప్రముఖ రచయిత్రి పెబ్బిలి హైమావతి హాజరయ్యారు. ప్రిన్సిపాల్ బీవీఎస్ఎస్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలుగు భాష పరిరక్షణ సమితి కన్వీనర్ కొయిలాడ రామ్మోహన్ రావు మాట్లాడుతూ ఇప్పటివరకూ పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో నిర్వహించిన 25 ప్రత్యేక కార్యక్రమాలతో విద్యార్థులు, పిల్లల్లో తెలుగుపట్ల ఆసక్తి పెంచేందుకు కృషి చేశామన్నారు. రేబాక కళాశాలలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో టి.ప్రసాద్‌కు ప్రథమ, బి.తనూజకు ద్వితీయ, వి.హాసినికి తృతీయ బహుమతులు లభించాయి. హిమజ, ఉమాదేవి, ఉదయసాయిలకు ప్రోత్సాహక బహుమతులందించారు. అంతకుముందు రచయితలు జయంతి ప్రకాశ శర్మ, పెబ్బిలి హైమావతిలను సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ రచయితలు డాక్టర్ చక్రపాణి, జి.రంగబాబు, రచయిత్రిలు అమరజ్యోతి, గాయత్రి, కళాశాల అధ్యాపకులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

అనకాపల్లిటౌన్ : ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు గంటా శ్రీరాం డిమాండ్ చేశారు. వ్యవసాయ పరిశోధనా స్థానం(ఆర్ఏఆర్ఎస్) ముందు మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన గెజిట్ ప్రకారం వేతనం పెంచాల్సిందేనన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎస్.చంద్రశేఖర్, కార్మికులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై వ్యాసరచన


పోటీలకు హాజరైన విద్యార్థులు

అనకాపల్లిటౌన్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని భారత వికాస్ పరిషత్ అధ్యక్షుడు ఎ.ఓంరాం అన్నారు. పట్టణంలోని గవరపాలెం బాలుర ఉన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ ప్రజల బాధ్యత అనే అంశంపై విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 140 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎ.సూర్యనారాయణ, ఉపాధ్యాయులు, పరిషత్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుగర్ ఫ్యాక్టరీ వద్ద టీడీపీ ధర్నా

అనకాపల్లిటౌన్ : మండలంలో తుమ్మపాల చక్కెర కర్మాగారాన్ని తెరిపించాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ ఎదుట అనకాపల్లి- చోడవరం రహదారిలో మంగళవారం ఆయన ధర్నాకు దిగారు. దీంతో ఈ రోడ్డులో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ దాడి మోహనరావుతోపాటు ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పీలాతోపాటు 15 మంది టీడీపీ నేతలను అరెస్టు చేసి, వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

'మాతృ భాషతోనే ఎదుగుదల'


మాట్లాడుతున్న బల్లా నాగభూషణం

అనకాపల్లిటౌన్ : ప్రతి ఒక్కరి మానసిక ఎదుగుదల మాతృభాషతోనే సాధ్యమని, మన మాతృభాష తెలుగును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం తెలిపారు. స్థానిక వన్‌వే ట్రాఫిక్ కూడలిలోని తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేసి అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుభాష గొప్పతనాన్ని ఎందరో మహానుభావులు తమ రచనల ద్వారా ప్రజ్వలింపజేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. పట్టణంలో హిమశేఖర్ కళాశాలలో జరిగిన మాతృభాష దినోత్సవంలో కరస్పాండెంట్ కె.జనార్దన్ తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుభాష ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అపారిశుధ్యంతో అవస్థలు


చెత్తాచెదారంతో రాజీవ్ గృహకల్ప సముదాయం

తుమ్మపాల : అనకాపల్లి మండలం శంకరం రాజీవ్ గృహకల్ప సముదాయంలో బ్లాకుల మధ్య ఖాళీ స్థలంలో మురుగు, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ఇక్కడ నివసిస్తున్న వెయ్యికిపైగా కుటుంబాలు సౌకర్యాల కొరత, పారిశుధ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో ఎక్కడ చూసినా చెత్తచెదారం పేరుకుపోయింది. మురుగునీరు నిలిచి దోమల బెడద ఎక్కువయింది. పారిశుధ్య సిబ్బందిని నియమించి, కాలనీని శుభ్రం చేయాలని కాలనీ వాసులు చాలా రోజుల నుంచి అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. అయినా స్పందన లేదని స్థానికులు వాపోతున్నారు. భౌగోళికంగా ఈ కాలనీ శంకరం పంచాయతీ పరిధిలోకి వస్తుంది. పంచాయతీలో అరకొర పారిశుధ్య సిబ్బంది ఉండటంతో గ్రామంలో పారిశుధ్య నిర్వహణకే సరిపోతున్నట్టు పంచాయతీ పాలకులు చెబుతున్నారు. మండల స్థాయి అధికారులు స్పందించి తాము రోగాల బారిన పడకుండా పారిశుధ్యాన్ని నిర్వహించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వైభవంగా దుర్గమాంబ తీర్థ మహోత్సవం


దుర్గమాంబ అమ్మవారు


విద్యుత్ దీపాలంకరణలో ఆలయం

సబ్బవరం: సబ్బవరం మండల ప్రజల ఆరాధ్య దైవం దుర్గమాంబ అమ్మవారి తీర్థ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. భక్తులు వేకువజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పసుపు కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించారు. అమ్మవారి దర్శనానికి సబ్బవరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి ఆలయ విద్యుద్దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాత్రికి నిర్వహించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ప్రోగ్రాం ఆకట్టుకుంది.

ఈ ఎమ్మెల్సీ ఎన్నిక ఎంతో కీలకం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): రాజకీయాల్లో విజయం కోసం పట్టుదల కనబరచాలని, ఎలాంటి ఎన్నికల్లోనైనా విజయం కోసం పోరాడాలని యలమంచిలి ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. అచ్యుతాపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న సుధాకర్‌ను గెలిపించాలని సూచించారు. విశాఖ రాజధాని అంశం కీలకం అయినందున ఈ ఎమ్మెల్సీ ఎన్నిక కీలకం అయ్యిందన్నారు. బీసీలకు పెద్దపీట వేస్తూ ఇటీవల నామినేటెడ్ ఎమ్మెల్సీ స్థానాలకు సీఎం అభ్యర్థులను ప్రకటించారని గుర్తు చేశారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, జెడ్పీటీసీ లాలం రాంబాబు, కో–ఆప్షన్ జెడ్పీ సభ్యుడు నర్మాల కుమార్, మండల పార్టీ నాయకులు కోన లచ్చన్నాయుడు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ, మండల సచివాలయాల కన్వీనర్ విజయ్ పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో ఉజ్వల భవిత

మునగపాక : పదో తరగతి తర్వాత సాంకేతిక విద్యను అభ్యసించడం ద్వారా ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు శరగడం గణేష్ తెలిపారు. మునగపాక జెడ్పీ హైస్కూల్లో మంగళవారం సాంకేతిక విద్య ద్వారా కలిగే మేలును వివరిస్తూ అవగాహన కల్పించారు. సాంకేతిక రంగాల్లో రాణించేందుకు టెన్త్ తరువాత మంచి చదువును ఎంచుకోవాలన్నారు. భవిష్యత్‌ను మార్చే చదువులపై దృష్టి సారించాలన్నారు. చదువులో ఏకాగ్రత, క్రమశిక్షణ ఉంటే ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చన్నారు.

చిట్టిపొట్టి చిన్నారుల స్నాతకోత్సవం


స్నాతకోత్సవంలో విద్యార్థులు, సిబ్బంది

అనకాపల్లిటౌన్ : స్థానిక భాష్యం స్కూల్లో మంగళవారం చిన్నారుల స్నాతకోత్సవం జరిగింది. యూకేజీ నుంచి ఫస్ట్‌క్లాస్‌కు వెళ్తున్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ స్నాతకోత్సవ దుస్తులు ధరింప చేసి, దంతవైద్యుడు పందూరి గణేష్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. అంతకు ముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, హెచ్ఎం ప్రదీప, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'పాఠశాలల్ని విలీనం చేయొద్దు'

అనకాపల్లి రూరల్ : పాఠశాలల విలీన చర్యలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. మంగళవారం అనకాపల్లిలో ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో 168 ప్రాథమిక పాఠశాలలను మూసివేయాలన్న ఆలోచనను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. రేషనలైజేషన్, పాఠశాలల విలీనానికి సంబంధించిన జీవోలు 117, 128పై కోర్టులో తుది తీర్పు రాకుండానే అనధికారికంగా పాఠశాలలను విలీనం చేయడం సమంజసం కాదన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యాచట్టం అమల్లో భాగంగా పేద విద్యార్థులను విద్యకు దూరం చేసే నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు.

వ్యక్తిత్వ వికాసంతో ఉన్నత శిఖరాలు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): పోటీ ప్రపంచంలో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సెట్విస్ జిల్లా మేనేజర్ బి.నూకరాజు సూచించారు. అచ్యుతాపురం మండలంలోని కైట్స్ కళాశాలలో మంగళవారం యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. నూకరాజు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉత్పన్నమయ్యే ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, అవకాశాలను బట్టి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని అన్నారు. రాంబిల్లి ఎన్‌జీవో నూకరాజు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.అప్పలనాయుడు, ఎ. సన్యాసిరావు పాల్గొన్నారు.

ఆర్‌డీవో పర్యటన


సివిల్ సప్లై గోదామును పరిశీలించిన ఆర్‌డీవో

పాయకరావుపేట : నర్సీపట్నం ఆర్‌డీవో జయరాం మండలంలో మంగళవారం పర్యటించారు. పట్టణంలో గల సివిల్ సప్లై గోదామును పరిశీలించారు. అనంతరం పీఎల్ పురం గ్రామ రెవెన్యూలో ఐ.టి.ఐ. నూతన భవనం నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. అదే విధంగా మంగవరం గ్రామంలో పెట్రోల్ బంక్ స్థలాన్ని పరిశీలించారు. డీటీ నూకరాజు, సర్వేయర్ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.